సాక్షి
జగిత్యాల
ఆదివారం । 28 । జనవరి । 2024



ధర్మపురిలో రద్దీ

ధర్మపురి: ధర్మపురి శ్రీ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. ముందుగా గోదావరిలో స్నానాలు ఆచరించి. అనంతరం స్వామివార్లను దర్శించుకున్నారు.



నకిలీ వీసాలతో మోసం

మెట్‌పల్లి పట్టణంలో నకిలీ వీసాలతో మోసం చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. 60మంది బాధితులు ఆందోళనకు దిగారు. 8లో▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
30.0/18.0

జిల్లాలో వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండగా ఉంటుంది. రాత్రి చలితీవ్రత పెరుగుతుంది. చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

మొగిలిపేట చెరువు మత్తడి సమీపంలో మొసలి



పెద్దచెరువు మత్తడి సమీపంలో మొసలి

మల్లాపూర్: మల్లాపూర్ మండలం మొగిలిపేట గ్రామంలోని పెద్దచెరువు మత్తడి సమీపంలో శనివారం మొసలి ప్రత్యక్షమయింది. స్థానికుల కథనం ప్రకారం.. వంటపొలాలకు నీరు పెట్టేందుకు వెళ్లిన కొందరు రైతులకు సమీపంలోని పెద్దచెరువు మత్తడి వద్ద మొసలి కనిపించింది. ఈ విషయాన్ని వారు గ్రామస్తులకు తెలియజేశారు. వారు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు.

మూల్యాంకన కేంద్రం ఏర్పాటు చేయాలి



వినతిపత్రం అందిస్తున్న జూనియర్ లెక్చరర్లు

జగిత్యాల: జగిత్యాల జిల్లాకేంద్రంలో ఇంటర్ పబ్లిక్ పరీక్షల మూల్యాంకన కేంద్రం ఏర్పాటు చేయాలని తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ 475 ఆధ్వర్యంలో ఇంటర్ విద్యా జిల్లా నోడల్ అధికారి నారాయణకు వినతిపత్రం అందించారు. ప్రస్తుతం కరీంనగర్‌లో ఇంటర్ స్పాట్ వాల్యుయేషన్ సెంటర్ నిర్వహించబడుతోందని, జగిత్యాలలో ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా పరిధిలో 15 ప్రభుత్వ జూనియర్ కళాశాలలతో పాటు ప్రైవేటు జూనియర్ కళాశాలలు, మోడల్‌స్కూల్స్ ఉన్నాయని, రాకపోకలకు అధ్యాపకులు ఇబ్బందులకు గురవుతున్నారు. అలాగే 2023 ఇంటర్ ప్రాక్టికల్స్, వార్షిక పరీక్షలు, సప్లిమెంటరీ పరీక్షల్లో విధులు నిర్వహించిన అధ్యాపకులకు పారితోషికం చెల్లించాలన్నారు. జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు కొట్టాల తిరుపతిరెడ్డి, కార్యదర్శి శ్రీలత, మాజిద్, సాజిద్, సుమేర శిల్ప పాల్గొన్నారు.

స్టాంపింగ్ వేసుకోవాలి



రైతుబజార్‌లో తనిఖీ చేస్తున్న అధికారులు

జగిత్యాల: కూరగాయలు, కిరాణం వ్యాపారులు తరాజు బాట్లకు స్టాంపింగ్స్ వేసుకోవాలని, అలాగే ఎలక్ట్రానిక్ యంత్రాలకు సైతం సాఫ్ట్‌వేర్ సరిచేసుకోవాలని తూనికల కొలతల శాఖ అధికారి అజీజ్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని రైతుబజార్‌లో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ బాట్లకు స్టాంపింగ్ వేయించుకోవాలని, ఎలక్ట్రానిక్ యంత్రాలను సరిచూసుకోవాలని, లేనిచో చర్యలు తీసుకుంటామని తెలిపారు.

30న ఉద్యోగ మేళా

జగిత్యాల: జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రైవేటు రంగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈనెల 30న ఉదయం 10.30 నుంచి 2 గంటల వరకు జిల్లా ఉపాధి కల్పన అధికారి కార్యాలయంలో ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి సత్తమ్మ తెలిపారు. పేటీఎంలో 100, శ్రీరాం లైఫ్ ఇన్సూరెన్స్‌లో 15 ఖాళీలున్నాయని, ఇంటర్వ్యూలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అభ్యర్థులు ఇంటర్, డిగ్రీ విద్యార్హత కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు 30న జాబ్‌మేళాకు హాజరై అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అంబేద్కర్ స్టడీ సర్కిల్ ప్రారంభం

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం జాబితాపూర్ గ్రామంలో శనివారం సీఎంఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో యువజన సంఘం సౌజన్యంతో అంబేద్కర్ స్టడీ సర్కిల్‌ను ప్రారంభించారు. సీఎంఆర్ ఫౌండర్ నక్క లక్ష్మణ్ మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ ఎదగాలని, గ్రామ అంబేద్కర్ సంఘ భవనంలో నర్సరీ నుంచి పదో తరగతి వరకు ఉచిత ట్యూషన్ అందించడం జరుగుతుందన్నారు. ఈ ట్యూషన్‌ను పిల్లలు, తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం చిన్నారులకు సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు, ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. కమిటీ సభ్యులు నలువాల రాజయ్య, గంగనర్సయ్య, నీలం గంగారాం, నక్క వెంకటేశ్, నక్క సతీశ్, ఈదుల గంగారాం, రాజు, నక్క అజయ్, ఉపాధ్యాయులు, గిరిధర్, ఉమారాణి పాల్గొన్నారు.

సెలవులో మున్సిపల్ కమిషనర్

జగిత్యాల: జగిత్యాల మున్సిపల్ కమిషనర్ అనిల్ బాబు నాలుగు రోజులు వ్యక్తిగత సెలవులో వెళ్లారు. ఆయన విధుల్లో చేరే వరకు ఇన్‌చార్జి కమిషనర్‌గా మున్సిపల్ డీఈ రాజేశ్వర్ వ్యవహరించనున్నట్లు సమాచారం.

నారసింహా.. మొర వినుమా!

- ధర్మపురి ఆలయ సిబ్బంది వేతన వెతలు
- ఏళ్లుగా పెరగని కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది వేతనాలు
- 20 ఏళ్ల నుంచి అదే జీతం.. కష్టంగా సాగుతున్న జీవితం
- జీతాలు పెంచాలని నూతన సర్కారుకు స్వీపర్లు, సబార్డినేట్‌ల వినతి



ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి ఆలయం



వీరంతా ధర్మపురి లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో పనిచేసే కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ స్వీపర్లు, సిబ్బంది. మొత్తం 50 మంది వరకు ఉంటారు. ఒక్కొక్కరు దాదాపు 20ఏళ్లుగా ఆలయంలో పనిచేస్తున్నారు. 12గంటల విధులు నిర్వహిస్తూ.. నిత్యం ఆలయాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేస్తుంటారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా సకల సౌకర్యాలు ఏర్పాటు చేస్తుంటారు. ఆలయానికి వచ్చే భక్తుల మొర వింటున్న దేవుడు, సౌకర్యాలు కల్పిస్తున్న దేవాదాయశాఖ అధికారులు ఇక్కడ పనిచేసే సిబ్బంది బాధలు పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. ఏళ్లకాలంగా పనిచేస్తున్న తమ జీతాలు పెంచడం లేదని, 20ఏళ్లలో కనీసం మూడింతల జీతం పెరగలేదని ఆవేదన వ్యక్తం చేస్తూ.. ఇటీవల నృసింహుని దర్శనానికి వచ్చిన రాష్ట్ర మంత్రులకు వినతిపత్రం ఇచ్చారు. కొత్త సర్కారులోనైనా తమ జీతాలు పెరిగి, జీవితాలు మారుతాయనే ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

గొల్లపల్లి: ధర్మపురిలోని పవిత్ర గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు నిత్యం వేలాది మంది భక్తులు తరలివస్తుంటారు. తెలంగాణ నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి ముందుగా గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి, లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకుంటారు. తెలంగాణలో యాదాద్రి తరువాత ధర్మపురి ఆలయమే ప్రసిద్ధి. వేలాది మంది భక్తులు.. ఏటా రూ.8కోట్ల ఆదాయంతో భక్తుల కొంగుబంగారంగా విరాసిల్లుతున్న నారసింహుడు తమ మొర వినడం లేదని ఆలయంలో పనిచేసే కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 20 ఏళ్లుగా స్వామివారి సేవలో తరిస్తున్నా తమ జీవితాలకు దేవాదాయశాఖ దారి చూపడం లేదని అంటున్నారు. చాలీచాలని జీతాలతో బతుకులు వెల్లదీస్తున్నామని, కొత్త సర్కారు కనికరం చూపాలని కోరుతున్నారు.

50మంది వరకు కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ సిబ్బందే..

- ధర్మపురి లక్ష్మీనృసింహుని ఆలయంలో 30మంది రెగ్యులర్ ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. 40 మందికి పైగా కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్నారు. 10 మంది వరకు దినసరి కూలీలుగా రోజుకు రూ.200 చొప్పున కూలికి పనిచేస్తున్నారు.
- కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ సిబ్బంది, దినసరి కూలీలు చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతున్నారు. రోజుకు 12 గంటల పాటు విధులు నిర్వహిస్తున్నామని, పనిచేస్తేనే జీతం వస్తుందని, శ్రమకు తగిన వేతనం ఇవ్వడం లేదని అంటున్నారు.
- ఒక్కొక్కరు 20 ఏళ్లక్రితం ఆలయంలో విధుల్లో చేరారని కనీసం ఒక్కరికి కూడా రూ.10వేల జీతం రావడం లేదని అంటున్నారు. ఆఫీసు సబార్డినేట్లు ఏడుగురికి రూ.7వేలు, ప్లంబర్‌కు రూ.5వేలు, స్వీపర్లకు రూ.9వేల వరకు వేతనం ఇస్తున్నారని వారు పేర్కొన్నారు.
- పెరిగిన ఖర్చులు, పాఠశాలల ఫీజులు, ఇంటి అద్దెలు, ఇతర ఖర్చులకు వచ్చే జీతం ఏమాత్రం సరిపోవడం లేదని, తమ జీతం గురించి తెలిసిన వాళ్లు కనీసం అప్పు కూడా ఇవ్వడం లేదని కొందరు సిబ్బంది పేర్కొన్నారు.
- ఇక దినసరి కూలీలకు రోజుకు రూ.200 చొప్పున చెల్లిస్తుండగా.. వీరు విధులు నిర్వహించే అంశం కనీసం ఆలయ రిజిష్టర్‌లో నమోదు కాకపోవడం విశేషం. తమకు అత్యవసర సమయంలో సెలవులు కావాలన్నా ఇవ్వరని, రెండు, మూడు రోజుల పాటు విధులకు రాకుంటే కొత్తవారిని నియమిస్తున్నారని పేర్కొన్నారు.
- జీతాల పెంపుకోసం ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేస్తున్నామని, సర్కారు మారినా తమ తలరాత మారడం లేదని చెబుతున్నారు. తమను రెగ్యులర్ చేస్తామని అధికారులు చెబుతున్నారని, ఆలయంలోని కొందరు అధికారులు తమ గోడును ఆలయ గోడలు దాటనివ్వడం పేర్కొన్నారు.
- ఇటీవల అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అయినా తమ కష్టాలను పట్టించుకోవాలని, శ్రమకు తగిన వేతనం ఇవ్వాలని, అర్హులైన వారిని రెగ్యులరైజ్ చేయాలని ఈ సందర్భంగా కోరుతున్నారు.

ఇబ్బందిగా ఉంది



నిత్యం 12గంటల పాటు ఆలయంలో విధులు నిర్వహిస్తాం. బ్రహ్మోత్సవాలు, పండుగ రోజుల్లో రద్దీ ఉంటుంది. అప్పుడు పని భారం పెరుగుతుంది. పనికి తగిన వేతనం లేదు. అత్యవసర సమయంలో సెలవులు ఇవ్వరు. కొత్తగా వచ్చిన ప్రభుత్వం స్పందించి మా వేతనాలు పెంచాలి. పర్మినెంట్ చేయాలి.

– ముదారి లక్ష్మి, స్వీపర్

అన్యాయం జరిగింది



గత ప్రభుత్వం హయాంలో మాకు వేతనాలు పెంచుతామని అన్నారు. పర్మినెంట్ చేస్తామని చెప్పారు. కానీ చేయలేదు. తెలంగాణ ప్రభుత్వంలో పర్మినెంట్ ఉద్యోగం వస్తుందని, వేతనాలు పెరుగుతాయని ఆశపడ్డాం. చాలీచాలనీ వేతనంతో ఇబ్బందులు పడుతున్నాం. కాంగ్రెస్ ప్రభుత్వం అయినా ఆదుకోవాలి.

– బత్తుల సత్తయ్య, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి


పెండింగ్‌లో ఉన్నాయి

ఆలయ ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు సిబ్బంది వేతనాలకు సంబంధించిన ఫైల్ ఎండోమెంట్ డిపార్టుమెంట్‌లో పెండింగ్‌లో ఉంది. కమిషనర్‌కు రిపోర్టు పంపించాం. గతంలో మంత్రిదృష్టికి కూడా తీసుకెళ్లాం. అప్పుడప్పుడూ వేతనాలు పెంచుతూనే ఉన్నా.. ఇంకా పెంచాల్సి ఉంది. మరోసారి ఉన్నతాధికారులకు నివేదిస్తాం.

– సంకటాల శ్రీనివాస్, ధర్మపురి ఆలయ ఇన్‌చార్జి ఈవో

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్



శిలాఫలకం ప్రారంభిస్తున్న విప్ లక్ష్మణ్ కుమార్

వెల్గటూర్ : అర్హులైన పేద ప్రజలందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తామని ప్రభుత్వ విప్, ధర్మపురి శాసనసభ్యుడు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. శనివారం ఎండపల్లి మండలం కొత్తపేట, వెల్గటూర్ మండలం తాళ్లకొత్తపేట గ్రామాల్లో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ కార్యాలయాలను లక్ష్మణ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే ఆరు గ్యారంటీల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్యశ్రీ పరిధి పెంపు వంటి పథకాలు అమలు చేయడం జరిగిందని తెలిపారు. ఫిబ్రవరిలో మరోరెండు గ్యారంటీలు అమలు చేస్తామని, త్వరలోనే మిగితా హామీలు కూడా అమలు చేసి పేద ప్రజలందరికీ న్యాయం చేస్తామని వివరించారు. వెల్గటూర్, ఎండపల్లి మండలాల్లో ఉన్న ప్రతీ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఎంపీపీ కూనమల్ల లక్ష్మి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాటిపర్తి శైలేందర్‌రెడ్డి, సర్పంచులు కొమ్ము రాంబాబు, ద్యావనపెల్లి లక్ష్మి, ఎంపీటీసీలు రంగు తిరుపతి, నక్క పూజిత, వెల్గటూర్, ఎండపల్లి తహసీల్దార్లు శేఖర్, ఉదయ్ కుమార్, ఎంపీడీవో సంజీవరావు, ఉప సర్పంచులు ధర్మాజి సతీశ్, గొనె లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కోదండరాంకు అభినందనలు



ఇబ్రహీంపట్నం: గవర్నర్ కోటలో ఎమ్మెల్సీగా ఎన్నికైన ప్రొఫెసర్ కోదండరాంను హైదరాబాద్‌లో తెలంగాణ జనసమితి రాష్ట్ర రైతు నాయకుడు, కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కంతి మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. టీజేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకుంట శంకర్, మండల అధ్యక్షుడు కంతి రమేశ్, రెబ్బటి మల్లయ్య, తరుణ్, చెట్‌పల్లి నరేందర్, గంగప్రసాద్ పాల్గొన్నారు.

చీపురు పట్టిన చిట్టిచేతులు





వెల్గటూరు మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలను శుభ్రం చేస్తున్న విద్యార్థినులు

- సర్కారు బడిలో స్వీపర్లుగా విద్యార్థులు
- వివాదాస్పదంగా వెల్గటూరు పాఠశాల హెచ్‌ఎం తీరు

వెల్గటూర్: ఆ పాఠశాలలో విద్యార్థులే స్వీపర్లు, ఆయాలు, అటెండర్లు. పాఠశాల గదులు శుభ్రం చేయడం, మరుగుదొడ్లు కడగడం, బెంచీలు వేయడం ఇలా అన్ని పనులు విద్యార్థులే చేస్తారు. బడికి వచ్చి పాఠాలు నేర్చుకోవాల్సిన విద్యార్థులతో అక్కడి ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు పనులు చేయిస్తున్న తీరుపై స్థానికులు, పిల్లల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెల్గటూర్ మండలకేంద్రంలోని ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విద్యార్థులతో పనులు చేయించడం వివాదాస్పదంగా మారింది. ఈ పాఠశాలలో 60మంది చిన్నారులు చదువుతున్నారు. ఐదుగురు టీచర్లు విధులు నిర్వహిస్తున్నారు. ఇక్కడ పారిశుద్ధ్య పనిచేసే తాత్కాలిక స్వీపర్ ఎండపల్లి మండలం పడకల్ నుంచి రావాలి. సదరు వ్యక్తి వారంలో రెండు రోజులు కూడా పాఠశాలకు హాజరుకాడు. కరోనాకు ముందు తాత్కాలిక ఆయా ఉండగా తరువాత తొలగించారు. ప్రస్తుతం పాఠశాలలో ఆయా లేకపోవడం, స్వీపర్ రాకపోవడంతో పరిశుభ్రత పడకేసింది. టాయిలెట్స్ కూడా శుభ్రం చేయకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో విద్యార్థులే స్వీపర్లుగా మారి పాఠశాలను శుభ్రం చేస్తున్నారు. ఓ వైపు ప్రభుత్వం మన ఊరు–మనబడి పేరుతో పాఠశాలల్లో సౌకర్యాలు కల్పించి, విద్యార్థుల సంఖ్యను పెంచి, నాణ్యమైన విద్యనందించేలా కృషి చేస్తుండగా, వెల్గటూర్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడే స్వయంగా విద్యార్థులతో పనులు చేయిస్తుండడంతో వారికి పాఠశాలకు పంపేందుకు తల్లిదండ్రులు వెనకాడుతున్నారు. ఆ విషయమై ఎంఈవో బత్తుల భూమయ్యను వివరణ కోరగా.. 'స్వీపర్ హాజరు కావడం లేదన్న విషయం మా దృష్టికి అక్కడి ప్రధానోపాధ్యాయుడు తీసుకురాలేదు. విద్యార్థులే పనులు చేస్తున్నట్లు తెలియదు. ఇదే నిజమైతే అవసరమైన చర్యలు తీసుకుంటాం' అని పేర్కొన్నారు.

ఎరువుల కొరతకు కట్టడి

- ప్రయివేటు షాపుల్లో కృత్రిమ కొరతపై ప్రభుత్వం చర్యలు
- ప్రత్యేక యాప్ రూపొందించిన వ్యవసాయశాఖ
- జిల్లావ్యాప్తంగా ముమ్మరంగా తనిఖీలు
- 31లోపు వివరాలు ఇవ్వాలని సర్కారు ఆదేశం



ఎరువుల నిల్వలు యాప్‌లో నమోదు చేస్తున్న డీఏవో సురేష్‌కుమార్

జగిత్యాలఅగ్రికల్చర్: రైతులు యాసంగి సాగులో బిజీగా ఉన్నారు. కొందరు నాట్లు వేస్తుండగా.. మరి కొందరు ఎరువులు చల్లుతున్నారు. కొద్దికాలంగా యూరియా, డీఏపీ ఎరువులు అక్కడక్కడ దొరకడం లేదు. ప్రభుత్వం రసాయన ఎరువులు పుష్కలంగా అందుబాటులో ఉన్నాయని చెబుతుండగా.. వ్యాపారులు మాత్రం ఎరువులు స్టాక్ లేదని, కృత్రిమ కొరత సృష్టిస్తూ.. ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నారు. ఈ ప్రభావం వ్యవసాయశాఖపై పడుతుండగా.. ఈసారి ఎరువుల కృత్రిమ కొరతకు చెక్ పెట్టేలా ఫైమ్(ఫర్టిలైజర్స్ ఇన్వెంటరీ వెరిఫికేషన్ సిస్టమ్)అనే యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది.

వాస్తవాలు తెలుసుకునేలా..

ఇప్పటికే జిల్లావ్యాప్తంగా ఎరువుల వ్యాపారులు పీవోఎస్(పాయింట్ ఆఫ్‌సేల్) యంత్రాలు ఉపయోగిస్తున్నారు. వీటిద్వారా దుకాణంలో ఉన్న ఎరువులు ఎన్ని, అందులో నుంచి ఏ రైతుకు ఏ మేరకు ఎరువులు ఇచ్చారనే విషయం తెలుస్తుంది. పీవోఎస్ యంత్రాల్లో పొందుపర్చిన ఎరువుల నిల్వలు, దుకాణాల్లో కనిపించే వాస్తవ నిల్వలకు మధ్య వ్యత్యాసాన్ని ఫైమ్‌యాప్ బయటపెడుతుంది. దీంతో ఎరువుల దుకాణాలను పర్యవేక్షించడం, నిల్వలు తెలుసుకోవడం వ్యవసాయాధికారులకు తేలికవుతుంది. దీంతో కృత్రిమ కొరత సృష్టించే అవకాశాలు ఉండవని అధికారులు చెబుతున్నారు.

కృత్రిమ కొరతకు అడ్డుకట్ట

ఫైమ్‌యాప్ ఉపయోగంపై ఇప్పటికే క్షేత్రస్థాయిలో పనిచేసే ఏఈవో నుంచి డీఏవో వరకు శిక్షణ పొందారు. ప్రస్తుత సీజన్‌లో యూరియా కొరత ఉండటం, ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవడంతో అధికారులు ఎరువుల దుకాణాలు తనిఖీ చేస్తున్నారు. ఇక నుంచి ప్రతీ ఏడీఏ తమపరిధిలో వారానికి కనీసం ఐదు దుకాణాలు తనిఖీ చేయాలని సర్కారు ఆదేశించింది. ఫైమ్‌యాప్‌ను కలెక్టర్‌తో పాటు జిల్లా వ్యవసాయశాఖాధికారి మాత్రమే లాగిన్ అయ్యే అవకాశం ఉండటంతో ఎప్పటికప్పుడు ఎరువుల నిల్వలు తెలిసే అవకాశం ఉంది.

అక్రమ నిల్వలు చేస్తే కఠినచర్యలు



ఎరువుల దుకాణదారులు తప్పనిసరిగ్గా పీవోఎస్ యంత్రాలు ఉపయోగించాలి. ఎరువుల వ్యత్యాసాల్లో తేడా కనబడితే, అటువంటి దుకాణదారులపై కఠినచర్యలు తీసుకుంటాం. ప్రతి ఫర్టిలైజర్ షాపును మా సిబ్బంది తనిఖీలు చేస్తున్నారు.

– సురేశ్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి, జగిత్యాల

ఎరువుల దుకాణాలు తనిఖీ

జిల్లాలో 355 ఎరువుల దుకాణాలు ఉన్నాయి. ఇప్పటి వరకు 212 దుకాణాలను వ్యవసాయాధికారులు తనిఖీ చేశారు. ఎరువులను పరిశీలించారు. ప్రస్తుతం జిల్లాలో యూరియా 51సింగిల్ విండోల్లో 1,915 మెట్రిక్ టన్నులు, 98 ఆగ్రోసేకేంద్రాల్లో 264 మెట్రిక్‌టన్నులు, మార్క్‌ఫెడ్ వద్ద 5,850 మెట్రిక్ టన్నులు, వ్యాపారుల వద్ద 2,175 మెట్రిక్ టన్నులు మొత్తం 10,204 మెట్రిక్‌టన్నుల యూరియా నిల్వ ఉంది. ఈ నెల 31లోపు అన్ని ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి, వివరాలు యాప్‌లో నమోదు చేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. ఈ మేరకు ప్రతీ సోమ, గురువారాల్లో ఒక్కో మండల వ్యవసాయాధికారి కనీసం ఐదు దుకాణాలు తనిఖీ చేసి వివరాలు యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు.

వసతుల కల్పనకు కృషి

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాలరూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల కల్పనకు కృషి చేస్తానని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. శనివారం జగిత్యాల రూరల్ మండలం గుల్లపేట గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను శనివారం పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండటంతో ఉపాధ్యాయులతో మాట్లాడి సంఖ్య పెంచేలా చూడాలని సూచించారు. ఉదయం 10 గంటలు దాటినా ప్రధానోపాధ్యాయుడు రాకపోవడంతో స్థాఫనరిగా లేకపోవడంతో విద్యార్థులు ఎలా బడికి వస్తారని మండిపడ్డారు. నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం గ్రామంలోని చెక్‌డ్యామ్‌ను పరిశీలించి మరమ్మతులు నిర్వహించాలని ఆశాఖ అధికారులకు ఆదేశించారు. మాజీ సర్పంచులు శేఖర్, భూంరెడ్డి, నాయకులు గంగారెడ్డి, మల్లారెడ్డి, లింగారెడ్డి పాల్గొన్నారు.

రైస్‌మిల్లు మూసివేతకు చర్యలు తీసుకోవాలి

జగిత్యాల: రాయికల్ పట్టణంలోని 10వ వార్డులో విశ్వనాథ్ అనే వ్యక్తి నిర్వహిస్తున్న మినీ మోడ్రన్ రైస్‌మిల్లుతో ప్రజలు కాలుష్యం బారిన పడి ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కలెక్టర్‌కు లేఖ రాశారు. ఆవాసాల మధ్య ఉండటంతో రైస్‌మిల్లు నుంచి వెలువడే దుమ్ము, ధూళితో అక్కడి ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారన్నారు. ఇప్పటికే చాలాసార్లు ఫిర్యాదు చేయడం జరిగిందని, అయినప్పటికీ చర్యలు చేపట్టలేదన్నారు. ఆర్‌ఐ విచారణ చేపట్టారని, రైస్‌మిల్లు నిర్వహించేందుకు పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు ఎన్‌వోసీ లేదని, రాయికల్ తహసీల్దార్‌కు నివేదిక సైతం ఇవ్వడం జరిగిందన్నారు. మున్సిపల్ కమిషనర్ మూసివేయాలని నోటీసులు ఇచ్చినప్పటికీ తదనుగుణంగా చర్యలు తీసుకోవడం లేదన్నారు. దీనిపై కలెక్టర్ చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ కోరారు.

కేసీఆర్‌తోనే గ్రామాలాభివృద్ధి



మహిళా సర్పంచులతో ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాలరూరల్: రాష్ట్రంలో గ్రామాల అభివృద్ధికి కేసీఆర్ నిరంతరం కృషి చేశారని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. శనివారం జగిత్యాలశివారులోని బీఎల్‌ఎన్ గార్డెన్స్‌లో జగిత్యాల నియోజకవర్గంలోని సర్పంచులు, ఉపసర్పంచులను సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని గ్రామాలను కేసీఆర్ అభివృద్ధి చేశారన్నారు. ప్రతినెలా నిధులు మంజూరు చేశారని తెలిపారు. పచ్చదనం పరిశుభ్రతలో తెలంగాణ గ్రామాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో జాతీయస్థాయిలో జగిత్యాల జిల్లా రెండోస్థానంలో రావడంలో సర్పంచులు, ఉపసర్పంచుల పాత్ర గొప్పదన్నారు. సర్పంచుల పదవీకాలం పూర్తయినా ప్రజలకు సేవచేస్తూ ఆదర్శంగా ఉండాలని ఆకాంక్షించారు. సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు చెరుకు జాన్, గొడిశెల గంగాధర్, గుర్రాల రాజేందర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, అనుపురం శ్రీనివాస్, ఉపసర్పంచులు ఉన్నారు.



జై హనుమాన్



కొండగట్టు(చొప్పదండి): జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొండగట్టు అంజనేయస్వామి ఆలయంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు తాకిడి కనిపించింది. సుమారు 30వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకోగా.. ఒక్కొక్క భక్తునికి దర్శనానికి రెండుగంటలకు పైగా సమయం పట్టింది. వివిధ రకాల టికెట్ల ద్వారా రూ.15 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. భక్తుల ఏర్పాట్లను ఏఈవో బుద్ది శ్రీనివాస్, మల్యాల ఎస్‌ఐ అశోక్, సూపరింటెండెంట్ శ్రీనివాస శర్మ, లక్ష్మీరాజం, సంపత్, లక్ష్మారెడ్డి తదితరులు పర్యవేక్షించారు.

క్లుప్తంగా

నకిలీ వీసాలతో మోసం

- సుమారు 60 మంది నుంచి డబ్బులు వసూలు
- బాధితుల ఆందోళన.. పోలీసులకు ఫిర్యాదు

మెట్‌పల్లి: దుబాయ్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి ఓ వ్యక్తి నకిలీ వీసాలు అంటగట్టి మోసం చేసిన సంఘటన జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణంలోని చోటు చేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. పట్టణంలోని చైతన్యనగర్‌కు చెందిన ఏలేటి రమేశ్ కొంతకాలంగా దుబాయ్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. ఆ దేశంలోని బిన్ బెలాయిలా కాంట్రాక్టింగ్ కంపెనీలో ఉద్యోగాలు ఇప్పిస్తానని అక్కడి నుంచి బంధువులకు, స్నేహితులకు సమాచారం ఇచ్చాడు. వారి ద్వారా నిర్మల్, నిజామాబాద్, మెట్‌పల్లి ప్రాంతాలకు చెందిన సుమారు 60 మంది నుంచి ఒక్కొక్కరి వద్ద రూ.26,500ను వసూలు చేశాడు. ఆ తర్వాత వీసాలు పంపకుండా జాప్యం చేస్తూ వస్తున్నాడు. కొన్ని రోజుల క్రితం మెట్‌పల్లికి వచ్చిన అతన్ని డబ్బులు ఇచ్చిన వారంతా కలిసి వీసాల గురించి ప్రశ్నించగా, తొందరలోనే వస్తాయని నమ్మబలికాడు. రోజులు గడుస్తున్నప్పటికీ రాకపోవడంతో అందరూ కలిసి గట్టిగా నిలదీశారు. ఈ నెల 26న పంపిస్తానని చెప్పడంతో వారంతా ఒక్కొక్కరు రూ.20 నుంచి రూ.28వేల వరకు వెచ్చించి విమాన టిక్కెట్లు తీసుకున్నారు. అనంతరం రమేశ్ ఇచ్చిన వీసాలతో శంషాబాద్ విమానాశ్రయానికి వెళ్లగా, అక్కడి అధికారులు వాటిని పరిశీలించి నకిలీవని తేల్చి చెప్పారు. ఖంగుతిన్న బాధితులంతా శనివారం మెట్‌పల్లిలోని అతని ఇంటి వద్దకు రాగా, అందుబాటులో లేకుండా పోయాడు. ఫోన్‌లో కూడా స్పందించకపోవడంతో అక్కడే ఆందోళనకు దిగారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. రమేశ్ మోసం వల్ల ఒక్కొక్కరు రూ.60 వేల వరకు నష్టపోయామని, తమకు న్యాయం చేయాలని ఎస్సై చిరంజీవిని కోరారు.




రాజన్నా దీవించు

వేములవాడ: సమ్మక్క జాతర సమీపిస్తుండడంతోపాటు వీకెండ్, వరుస సెలవులు రావడంతో శనివారం వేములవాడ రాజన్నను 25వేల మంది భక్తులు దర్శించుకున్నారు. రాజన్న క్షేత్రం రద్దీగా మారింది. ధర్మగుండంలో స్నానాలు చేసిన భక్తులు తడి బట్టలతో కోడెమొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల ద్వారా రూ.35 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఏర్పాట్లను ఈవో కృష్ణప్రసాద్, ఏఈవో శ్రీనివాస్, పర్యవేక్షకులు తిరుపతిరావు, అల్లి శంకర్, శ్రీరాములు పరిశీలించారు.

ఆవేదన దించుకోవాలె.. జనంతో పంచుకోవాలె!

- 'పెద్దింటి' కథలు.. వలస కన్నీళ్లు
- పల్లె ఆత్మ కథల్లో ఆవిష్కరణ
- కదిలించిన కరువు, కూలిపోతున్న కులవృత్తులు
- కథకుడు, మాటలు, పాటల రచయిత అశోక్‌కుమార్ సాహిత్య ప్రస్థానం


అశోక్‌కుమార్

సాక్షి, కరీంనగర్ డెస్క్: ఆయన కథలు చదువుతుంటే మట్టి వాసన పరిమళిస్తుంది.. పల్లెల ముఖచిత్రం కళ్లముందు మెదులుతుంది.. మనసును కథలోకి లాక్కెళ్తాడు.. గుండెను పిండేసి కన్నీరు పెట్టిస్తాడు.. మానవ విలువలను రంగరించి రుచిచూపిస్తాడు. నవలంటే జీవితం.. ఓ తరం చరిత్ర, వికాసం, అభివృద్ధి. అలాంటి నవలా ప్రపంచంలో కొత్త చరిత్రను రాసినవాడు పెద్దింటి అశోక్‌కుమార్. రాజన్న సిరిసిల్ల జిల్లా భీముని మల్లారెడ్డిపేట స్వస్థలం. ఐదు దశాబ్దాల తెలంగాణ చరిత్రను తన ఐదు నవలల్లో ఆవిష్కరించారు. భాషాసంస్కృతుల మీద దృష్టిపెట్టి, పల్లె జీవితాన్ని, ఆచార వ్యవహారాలను చిత్రించారు. ఆయన రాసిన 'జిగిరి' నవల 12 భారతీయ భాషల్లోకి అనువాదమైంది. అశోక్‌కుమార్ 250 వరకు కథలు, 9 నవలలు, 8 కథాసంపుటిలు, 6 నాటికలు, 100 వరకు సామాజిక వ్యాసాలు రాశారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా, పాఠ్యాంశాల రూపశిల్పిగా, కథకుడిగా, మాటలు, పాటల రచయితగా ప్రసిద్ధి చెందారు. పెద్దింటి అశోక్‌కుమార్ సాహిత్యానికి పాతికేళ్లు పూర్తయిన సందర్భంగా పలకరించగా చెప్పిన పలు విషయాలు ఆయన మాటల్లోనే..

- నేను 1968 ఫిబ్రవరి 6న గంభీరావుపేట మండలం భీమునిమల్లారెడ్డిపేటలో పుట్టాను. అమ్మానాన్న మల్లవ్వ, అంజయ్య. మాది రెండెకరాల పేద కుటుంబం. నా ప్రాథమిక విద్య మా ఊరిలోనే సాగింది. ఉన్నత విద్య మా పక్క ఊరు లింగన్నపేటలో చదివాను. ఇంటర్ గంభీరావుపేటలో చేశాను. కాకతీయ విశ్వవిద్యాలయంలో ఎంఏ తెలుగు, శ్రీకృష్ణ దేవరాయ విశ్వవిద్యాలయంలో ఎంఎస్సీ(గణితం), ఉస్మానియా విశ్వవిద్యాలయంలో బీఈడీ పూర్తి చేసి, 1996లో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా మా పక్క ఊరు కోరుట్లపేటలో జాయిన్ అయ్యాను. మా ఊరి నుంచే బడికి వెళ్లేవాడిని.
- అప్పట్లో కరువు పరిస్థితులు, వలసలు, ప్రపంచీకరణ, కూలిపోతున్న కులవత్తులు నన్ను కదిలించాయి. నా చిన్నప్పుడే మా నాన్న బతుకుదెరువు కోసం గల్ఫ్ వెళ్లాడు. అప్పట్లో ఉత్తరం వచ్చేందుకు నెలలు పట్టేది. మా సమీప బంధువులు చాలా మంది గల్ఫ్ దేశాలకు వెళ్లారు. అలా నేను ఒక రకంగా వలస కుటుంబాలు కష్టాలను, కన్నీళ్లను దగ్గరి నుంచి చూశాను. అవే కథావస్తువులు అయ్యాయి.


పుస్తకాల ముఖచిత్రాలు

- 1999లో రచనా రంగంలోకి వచ్చాను. 'ఆశ.. నిరాశ.. ఆశ' నా తొలిరచన. అది అప్పట్లో ఓ ప్రముఖ దినపత్రికలో ప్రచురితమైంది. తెలంగాణ యాసను, భాషను, సామెతలను ఆవిష్కరిస్తూ.. అనేక కథలు రాశాను. తెలంగాణ అంటేనే వలసలకు నిర్వచనం. అవి ఉత్తర తెలంగాణలో మరీ ఎక్కువ. ఆ వలస వెనుక విషాదం దాగి ఉంటుంది. కన్నీళ్లు పొంగుతాయి. వలసలోని వికత రూపాలను 2001లో 'ఎడారి మంటలు'గా చిత్రించాను. దేశం కాని దేశంలో భాషరాని రాజ్యంలో తెలంగాణ బిడ్డలు పడుతున్న బాధలు.. కొడుకులు దూర దేశంలో ఉంటే ఇక్కడ తల్లులు పడుతున్న తండ్లాట రాశాను.
- గ్రామీణ పర్యావరణాన్ని అంశంగా తీసుకొని 'దాడి' నవల రాశాను. వ్యవసాయం ఏతం, మోట, రాటు, డీజిల్ ఇంజిన్లను దాటుకొని హైస్పీడ్ మోటార్లు, సబ్‌మెర్సిబుల్ పంపులదాకా వచ్చింది. ఫలితంగా దోసెడు మట్టిని తీస్తే దోసెడు నీళ్లూరే భూములు నీళ్లు లేక ఎండిపోయాయి. అడవులు నాశనమైపోయాయి. ఇప్పుడే ఇలా ఉంటే భవిష్యత్ తరాలకు నీరు ఎలా అందుతుందన్న ప్రశ్నను ముందుంచుతూ 'దాడి'ని రాశాను.
- జంతులక్షణాలు ఉన్న మనిషికి.. మనిషి లక్షణాలు ఉన్న జంతువుకు మధ్య సంఘర్షణే 'జిగిరి' నవల. ఆకాశవాణిలో ప్రసారమైంది. ఇలా ఇప్పటివరకు నవలలుగా ఎడారి మంటలు (2002), దాడి (2005), జిగిరి (2006), ఊరికి ఉప్పులం (2007), సంచారిని (2011), మిలియన్ మార్చ్ (2017), ఇంకెంత దూరం (2020) రాశాను. కథా సంపుటాలుగా ఊటబాయి (2003), వలస బతుకులు (2004), మా ఊరి బాగోతం (2005), మాయిముంత (2007), భూమడు (2009), పోరుగడ్డ (2011), అమ్మకి రాశిమే (2015), గుండెలో వాన (2021) ప్రచురితమయ్యాయి. ఎండమావి (2005), పోరుగడ్డ (2016), తెగారం (2018), నెసరు (2021) నాటకాలుగా ఆకాశవాణిలో ప్రసారమయ్యాయి. తెగారం నాటకానికి నటనలో నంది అవార్డు సహా పలు అవార్డులు వచ్చాయి. నేను రాసిన మరో 25 కథలు హిందీలోకి అనువాదం అయ్యాయి.


రామాజిపేట స్కూల్‌లో ప్రధానోపాధ్యాయుడిగా అశోక్‌కుమార్ ఊరి జనం ముందు రెఫరెండం (ఫైల్)

- కథా రచయితగా ఉన్న నేను తొలిసారి 2010లో వేదం సినిమాకు మాటలు రాశాను. ఆ సినిమా నిర్మాత క్రిష్ నన్ను పిలిచి, తెలంగాణ మాండలికం పోర్షన్‌కు మాటలు రాయించారు. ఆ సినిమాలోని ఓ పాత్రకు నేను 'సిరిసిల్ల రాజయ్య'అనే పేరు పెట్టాను. అలా 'దాగుడు మూతలు దండాకోర్', 'మల్లేశం', 'దొరసాని', 'తమసోమ జ్యోతిర్గమయ', 'షరతులు వర్తిస్తాయి' వంటి సినిమాలకు పని చేశాను. పలు సినిమాల్లో పాటలు రాశాను. నటించాను కూడా. నేను రాసిన జిగిరి నవల సినిమాగా రాబోతుంది. ఇప్పటికే నా 'ఊటబాయి' కథను అదేపేరుతో పాలసాని వేణు చిన్న సినిమాగా తీశారు. టీవీ సీరియల్‌గా కూడా కొన్ని కథలు బుల్లితెరకెక్కాయి. ఇంకా కొన్ని సినిమాలకు కమిట్‌మెంట్ కుదిరింది.
- నేను రాసిన 8 కథలు వివిధ విశ్వవిద్యాలయాల్లో పాఠ్యాంశాలయ్యాయి. కాకతీయ వర్సిటీ ఎంఏ తెలుగు విభాగం విద్యార్థులకు 'మాయిముంత', 'ఇగురం' కథలు పాఠ్యాంశాలుగా మారాయి. ఉస్మానియా వర్సిటీ 'జిగిరి', నవలను, 'గోస' కథను 'లాంగ్ మార్చ్' నవలను పాఠ్యాంశంగా చేర్చారు. దక్షిణ భారతీయ భాషా అధ్యయన కేంద్రం మైసూర్ వారు తెలుగు విద్యార్థులకు 'అనగనగా ఓ కోడి పెట్ట' కథను పాఠ్యాంశం చేశారు. నాగార్జున వర్సిటీ పరిధిలోని సిల్వర్ జూబ్లీ కళాశాల విద్యార్థులకు రైతు జీవితం నేపథ్యంలో రాసిన 'గుండెలోన వాన' కథను బోధిస్తున్నారు. ఓరియంటల్ కాలేజీ పీడీసీలో జిగిరి నవల పాఠ్యాంశమైంది. నా సాహిత్యంపై ఆరుగురు పరిశోధనలు, ఆరుగురు ఎంఫిల్ చేశారు. విచిత్రంగా నేను తెలుగుపై పీహెచ్‌డీ చేస్తుండగా.. నా జిగిరి నవల గురించి నాకే ప్రశ్న వచ్చింది. తెలుగు మహాసభల్లో అప్పటి సీఎం కేసీఆర్ నా సాహిత్య శైలిని ప్రస్తావించడం సంతోషమనిపించింది.
- నేను గవర్నమెంట్ టీచర్‌గా పని చేస్తూ.. బండలింగంపల్లిలో 'గుండ్ల చెరువు' పేరుతో స్కూల్ మ్యాగజైన్‌ను నడిపించాను. రామాజిపేటలో మా పనితీరుపై ఆ ఊరి ప్రజల ముందు రెఫరెండం పెట్టాను. ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశ పెట్టాలన్న వారి కోరికను నెరవేర్చుతూ బోధనలో మార్పులు తెచ్చాం. సర్కారు బడిని బతికించాలన్న ఉద్దేశంతో 12 లఘుచిత్రాలు తీశాను.
- మా ఊరే నన్ను కథకుడిని చేసింది. ఎండిన వాగులు.. కరిగిపోయిన కొండలు.. మొరం తేలిన వాకిళ్లు.. గల్ఫ్ దేశాలకు వలసలు.. నన్ను కదిలించాయి. నా గుండెను పిండేసిన సంఘటనలు.. బాధలు.. నా మనసులోని బరువు దించుకోడానికి నేను కథలు రాశాను. అవి కథలు కాదు.. వాస్తవిక ఘటనలకు సజీవ సాక్ష్యాలు.. నేను ఇంకా రాస్తూనే ఉంటాను. నా ఈ సాహిత్య ప్రయాణంలో నా భార్య మంజుల, కూతుళ్లు సాహితి, సతి సహకారం మరువలేనిది. కథకుడిగా ఇప్పటికి 25 ఏళ్లవుతోంది. 11 కథలతో 'విత్తనం' అనే కథల సంపుటి రాబోతుంది.

ముంపు బాధితులను ఆదుకోవాలి


నాయబ్ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న బాధిత రైతులు

ముస్తాబాద్(సిరిసిల్ల): చెరువులో పట్టా భూములు కోల్పోతున్న తమను ఆదుకోవాలని రైతులు ముస్తాబాద్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట శనివారం ఆందోళన చేపట్టారు. మండలంలోని చీకోడుకు చెందిన చింతల చెరువు ముంపు బాధిత రైతులు ధర్నా చేపట్టి మాట్లాడారు. నాలుగేళ్లుగా చింతల చెరువులోకి మల్లన్నసాగర్ నీరు విడుదల చేయడంతో 110 ఎకరాలు ముంపునకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టా భూములు నీటిలో మునిగిపోవడంతో పంటలు సాగు చేయడం లేదన్నారు. చెరువు నీటిలో భూములు పోవడంతో ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. భూమికి బదులు భూమి ఇప్పించాలని, లేదా మల్లన్నసాగర్ నీటి విడుదలను ఆపాలని కోరారు. ఈమేరకు నాయబ్ తహసీల్దార్ సురేశ్‌కు వినతిపత్రం అందజేశారు. రైతులు కాంపెల్లి శ్రీనివాస్, రాజిరెడ్డి, నర్సయ్య, నాంపెల్లి, పోశరాములు, విజయ, ఎల్లం, రమేశ్, చందు, రాజశేఖర్, ఎల్లయ్య, రాజలింగం తదితరులు పాల్గొన్నారు.

సీబీఎస్ఈ గణిత పోటీల్లో ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్ ప్రసాదరావు

కొత్తపల్లి(కరీంనగర్): సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) ఆధ్వర్యంలో ఏటా నిర్వహించే ఆర్యభట్ట గణిత చాలెంజ్ పోటీల్లో కరీంనగర్ పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ రితేశ్ మెహతా తెలిపారు. లెవల్-1, 2ల్లో నిర్వహించిన పరీక్షకు దేశవ్యాప్తంగా రూ.5.50 లక్షల మంది హాజరయ్యారని అన్నారు. ప్రతీ రీజియన్‌లో 100 మందిని ఎంపిక చేయగా వారిలో జిల్లా నుంచి నలుగురికి చోటు దక్కిందని పేర్కొన్నారు. వీరిలో ముగ్గురు పారమిత విద్యార్థులుండటం గర్వంగా ఉందన్నారు. ఈ మేరకు పాఠశాలలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు సీహెచ్.లక్ష్మీ హాసిని, జి.హరికాంత్, బి.విశాల్‌రెడ్డిలను విద్యాసంస్థల చైర్మన్ ప్రసాదరావు అభినందించారు. డైరెక్టర్లు అనుకర్‌రావు, రశ్మిత, ప్రసూన, వినోద్‌రావు, వీయూఎం.ప్రసాద్, ప్రోగ్రాం హెడ్ గోపీకృష్ణ, గైడ్ టీచర్ సంపత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలస్యంగా నడుస్తున్న సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు

రామగుండం: న్యూఢిల్లీ నుంచి చెన్నై మార్గంలో సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్ల గంటల కొద్దీ ఆలస్యంగా నడిచాయి. ప్రధానంగా శనివారం రామగుండం చేరుకోవాల్సిన పలు రైళ్లు దాదాపు 12 గంటలకుపైగా ఆలస్యంతో వచ్చాయి. దీంతో ప్రయాణికుల పర్యటన షెడ్యూల్‌లో మార్పులు చోటుచేసుకున్నాయి. గంటల కొద్దీ నిరీక్షించాల్సి రావడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. న్యూఢిల్లీలో దట్టమైన పొగమంచుతో రాత్రి, వేకువజామున బయలుదేరే రైళ్లు మధ్యాహ్నం వేళ బయలు దేరుతున్నాయి. దీంతో రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయని రైల్వే అధికారులు తెలిపారు.

రామగుండం చేరుకునే రైళ్ల సమయం ఇలా..

- రైలు నంబరు 12511 కొచ్చువెల్లి -రక్షిసాగర్ రామగుండం ఉదయం 9.25గంటలకు రావాల్సి ఉండగా 7.30 గంటల ఆలస్యంగా సాయంత్రం 4గంటలకు చేరుకుంది.


తెలంగాణ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు

- రైలు నంబరు 20806 న్యూఢిల్లీ-విశాఖపట్నం ఏపీ ఎక్స్‌ప్రెస్ రామగుండం మధ్యాహ్నం 3.49 గంటలకు రావాల్సి ఉండగా 12 గంటల ఆలస్యంతో ఆదివారం వేకువజాము 3.31 గంటలకు రానుంది.
- రైలు నంబరు.12616 న్యూఢిల్లీ-చెన్నై జీటీ ఎక్స్‌ప్రెస్ రామగుండం సాయంత్రం 4.09గంటలకు రావాల్సి ఉండగా పది గంటల ఆలస్యంగా ఆదివారం వేకువజామున 2.10గంటలకు చేరుకుంటుంది.
- రైలు నంబరు 12626 న్యూఢిల్లీ-త్రివేండ్రం కేరళ ఎక్స్‌ప్రెస్ రామగుండం సాయంత్రం 4.59 గంటలకు రావాల్సి ఉండగా 15 గంటల ఆలస్యంతో ఆదివారం ఉదయం 7.42 గంటలకు రానుంది.
- రైలు నంబరు 12724 న్యూఢిల్లీ-హైదరాబాద్ తెలంగాణ ఎక్స్‌ప్రెస్ రామగుండం మధ్యాహ్నం 12.31గంటలకు రావాల్సి ఉండగా 12 గంటల ఆలస్యంతో అర్ధరాత్రి ఒంటి గంటకు రానుంది.

దోపిడీకి పాల్పడిన ఇద్దరి అరెస్ట్

- సీసీ ఫుటేజీ ఆధారంగా పట్టివేత

సిరిసిల్లక్రైం: ఒంటరిగా వెళ్తున్న మహిళలను లక్ష్యంగా చేసుకొని దోపిడీకి పాల్పడుతున్న ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ శనివారం తెలిపారు. సీసీ నిందితులను పట్టుకున్న సిరిసిల్ల రూరల్ సీఐ సదన్‌కుమార్, ఆర్ఎస్ఐ జునైద్, సిబ్బంది నరేందర్, రాజశేఖర్, శ్రీనివాస్, అక్బర్‌లకు రివార్డులు అందించారు. ఎస్పీ తెలిపిన వివరాలు. తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల గ్రామానికి చెందిన రుద్రాపు పోషవ్వ అనారోగ్యంతో ఉండగా చికిత్స కోసం జిల్లెల్ల క్రాసింగ్ వద్ద ఉన్న ఆర్ఎంపీ వద్దకు ఈనెల 12న వెళ్లి ఇంటికి తిరిగి వస్తుంది. గమనించిన ఓ మహిళ, మరో పురుషుడు బైక్‌పై వచ్చి వృద్ధురాలి ఇంటి వద్ద దిగబెడతామని బైక్ ఎక్కించుకున్నారు. ఇంటి వద్ద దించే క్రమంలో వృద్ధురాలి మెడలోని పుస్తెలతాడును తెంపుకొని పరారయ్యారు. బాధితురాలు తంగళ్లపల్లి ఠాణాలో ఫిర్యాదు చేసింది. సీఐ, ఆర్ఎస్సైలు పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాలను పరిశీలించారు. ఈనెల 26న బద్దెనపల్లి క్రాసింగ్ వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించారు. సిద్దిపేట జిల్లాకు చెందిన సిద్ద యాదవ్వ, బోదాసు నరేశ్‌లు ఈ దోపిడీకి పాల్పడినట్లు ఒప్పుకున్నారు.


ఎస్పీ అఖిల్ మహాజన్ చేతుల మీదుగా రివార్డు అందుకుంటున్న సీఐ సదన్‌కుమార్, సిబ్బంది

జాతీయ కబడ్డీ పోటీలకు ఎంపిక



కరీంనగర్ స్పోర్ట్స్: కడప జిల్లాలోని రాయపూర్‌లో ఈ నెల 28 నుంచి 31 వరకు 67వ జాతీయ స్థాయి కబడ్డీ అండర్-14 బాలికల చాంపియన్‌షిప్ పోటీలు జరగనున్నాయి. ఈ పోటీలకు కరీంనగర్‌లోని పారమిత ఉన్నత పాఠశాల విద్యార్థిని కృతిక ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు బాలాజీ తెలిపారు. ఇటీవల జనగాంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఆమె ప్రతిభ కనబరిచినట్లు పేర్కొన్నారు. పారమిత పాఠశాలల అధినేత ఇనుగంటి ప్రసాదరావు శనివారం ఆమెను అభినందించారు.

జాతీయ బేస్‌బాల్ పోటీలకు..



కరీంనగర్‌స్పోర్ట్స్: చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని కోర్బాలో ఈ నెల 28 నుంచి ఫిబ్రవరి 1 వరకు 67వ జాతీయస్థాయి అండర్-14 బేస్‌బాల్ చాంపియన్ షిప్ పోటీలు జరగనున్నాయి. ఈ పోటీలకు కరీంనగర్ మానేరు విద్యాసంస్థలకు చెందిన విద్యార్థి అక్షయ్ కార్తీక్ ఎంపికయ్యాడు. ఇటీవల తొర్రూర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచాడు. ఈ సందర్భంగా విద్యార్థిని మానేరు విద్యాసంస్థల అధినేత అనంతరెడ్డి శనివారం అభినందించారు.

స్కూల్ ప్రిన్సిపాల్ అదృశ్యం


ఆనంద్

కరీంనగర్‌క్రైం: ఓ ప్రైవేట్ స్కూల్ ప్రిన్సిపాల్ అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. మంకమ్మతోటలోని వాసముండే కమలాకర ఆనంద్ ఠి మ్యాపూర్‌లోని తన స్నేహితుడి వద్ద కు డబ్బుల కోసం వెళ్తున్నానని శుక్రవారం ఇంట్లో చెప్పి, వెళ్లాడు. కానీ, తిరిగి రాలేదు. బంధువులు, తెలిసిన వారి ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో అతని భార్య సుస్మిత శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

మంచం పట్టిన పదిర

- నెల రోజులుగా వీడని జ్వరాలు ● గ్రామంలో మెగా వైద్యశిబిరం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని పదిర గ్రామస్తులు నెల రోజులుగా జ్వరాలతో బాధపడుతున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నా జ్వరాలు తగ్గడం లేదు. ఇంటికొకరి చొప్పున జ్వరపీడితులు ఉన్నారు. ఈ విషయమై జిల్లా వైద్యాధికారి సుమన్‌మోహన్‌రావుకు ఫిర్యాదు అందగా వెంటనే స్పందించారు. గ్రామంలో మెగా వైద్యశిబిరం ఏర్పాటు చేసి తక్షణం వైద్యం అందించాలని ఆదేశించారు. వెంటనే వైద్యాధికారులు శనివారం పదిర గ్రామంలో పర్యటించారు. ఇంటింటికెళ్లి వివరాలు సేకరించి వైద్యసేవలు అందించారు. జిల్లా సబ్‌యూనిట్ అధికారి మోహన్, మండల ఇన్‌చార్జి వైద్యాధికారి చిరంజీవి ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది ఇంటింటికి తిరిగి జ్వరాలతో బాధపడుతున్న రోగుల వివరాలు సేకరించి వైద్యసేవలందిస్తున్నారు. జ్వరం తీవ్రంగా ఉన్న వారిని సిరిసిల్ల ఏరియాస్పత్రికి తరలించారు. డ్రైనేజీల్లో దోమల నివారణకు మందు పిచికారీ చేశారు. వైద్య సిబ్బంది నరేందర్, రమేశ్, పద్మ, స్వప్నదేవి, అనసూయ, లక్ష్మీప్రసన్న, పద్మ, మౌనిక, లత, సర్పంచ్ కుంబాల వజ్రమ్మ, పంచాయతీ కార్యదర్శి సాగరిక, కారోబార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య


యాకూబ్ పాషా (ఫైల్)

సుల్తానాబాద్‌రూరల్: పట్టణంలోని గడిమహిల్‌కు చెందిన ఎండీ యాకూబ్‌పాషా(రాహిల్)(33) శనివారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఎస్సై విజేందర్, కుటుంబసభ్యుల కథనం ప్రకారం యాకూబ్‌పాషా స్థానికంగా సెల్ రిపేర్ సెంటర్ నడిపిస్తూ జీవిస్తున్నాడు. నిరుపేద కుటుంబం కావడంతో ఆర్థికంగా ఇబ్బందులు తలెత్తాయి. వీటిని అధిగమించలేక మానసికంగా కృంగిపోయాడు. తీవ్ర మనస్తాపంతో ఈక్రమంలో ఈనెల 5న గడ్డిమందు తాగాడు. కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి చెల్లెలు నిషాత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి భార్య ఉంది. ఆమె తొమ్మిది నెలల గర్భిణీ అని కుటుంబ సభ్యులు తెలిపారు.

భార్యను వేధించిన భర్తకు ఐదేళ్ల జైలు

కరీంనగర్ క్రైం: అదనపు కట్నం కోసం భార్యను వేధింపులకు గురిచేయడంతోపాటు అత్తింటివారు ఉంటున్న గుడిసెను తగులబెట్టిన కేసులో చెక్కల శివకృష్ణకు ఐదేళ్ల జైలుశిక్ష, రూ.30 వేల జరిమానా విధిస్తూ కరీంనగర్ ప్రత్యేక ఫ్యామిలీ కోర్టు జడ్జి లక్ష్మీకుమారి తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. ఎల్ఎండీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మహాత్మానగర్ బావుల కాలనీకి చెందిన దివ్య అదే కాలనీకి చెందిన చెక్కల శివకృష్ణ ఐదేళ్ల క్రితం ప్రేమించి, పెళ్లి చేసుకున్నారు. మూడేళ్లు భార్యతో కలిసి కాపురం చేసిన శివకృష్ణ తర్వాత రూ.5 లక్షల అదనపు కట్నం తీసుకురావాలంటూ ఆమె వేధింపులకు గురిచేశాడు. దీనిపై పంచాయితీ పెట్టగా భార్యను మంచిగా చూసుకుంటానని చెప్పాడు. కొన్ని రోజుల తర్వాత తిరిగి వేధించడం ప్రారంభించాడు. 2022 అక్టోబర్ 10న రాత్రి శివకృష్ణ అత్తామామ ఉండే గుడిసెను తగులబెట్టాడు. ఈ ఘటనపై దివ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎల్ఎండీ పోలీసులు శివకృష్ణపై కేసు నమోదు చేసి, దర్యాప్తు జరిపారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జూలూరు శ్రీరాములు సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా న్యాయమూర్తి సాక్ష్యాధారాలు పరిశీలించి, శివకృష్ణకు శనివారం జైలుశిక్ష, జరిమానా విధించారు.

నర్సింగ్ కోర్సు అభ్యర్థులకు జపాన్‌లో ఉద్యోగాలు

- టాంకాం ద్వారా ఎంపిక
- రూ.1.50 లక్షల నుంచి రూ.2లక్షలు వేతనం
- జనవరి 29న స్క్రీనింగ్ పరీక్షలు
- జిల్లా ఉపాధి కల్పన అధికారి రాఘవేందర్

సిరిసిల్ల: నర్సింగ్ కోర్సులను పూర్తి చేసిన అభ్యర్థులకు జపాన్‌లో ఉద్యోగావకాశాలు ఉన్నాయని జిల్లా ఉపాధి కల్పనాధికారి రాఘవేందర్ శనివారం తెలిపారు. తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టీవోఎంసీవోఎం) ద్వారా రిక్రూట్‌మెంట్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. తాజాగా బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం డిప్లొమా హెల్పర్స్ కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులని వివరించారు. టాంకాం ద్వారా గతంలో రెండు బ్యాచ్‌ల్లో 31 మందికి జపాన్‌లో ఉపాధి అవకాశాలు కల్పించిందని, మూడో బ్యాచ్ ఎంపికకు జనవరి 29న హైదరాబాద్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్కిల్ ట్రెయినింగ్ (ఎన్ఎస్‌టీఐ)లో ఉదయం 10 గంటల నుంచి స్క్రీనింగ్ పరీక్షలు జరుగుతాయని వివరించారు. ఎంపికైన అభ్యర్థులకు జపనీస్ భాషపై, అదనపు వృత్తిపరమైన నైపుణ్యాన్ని రెసిడెన్షియల్ శిక్షణను హైదరాబాద్‌లోనే ఇస్తారని తెలిపారు. శిక్షణ పూర్తి చేసిన అభ్యర్థులకు నెలకు రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు సంపాదించే అవకాశం ఉందని స్పష్టం చేశారు. పూర్తి వివరాల కోసం 89190 47600, 63022 92450, 95739 45684 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

రాజకీయాల్లో శత్రువులుగా ఉండొద్దు

- మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్
- బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ప్రారంభం


బ్యాడ్మింటన్ ఆడుతున్న వినోద్‌కుమార్

కరీంనగర్ స్పోర్ట్స్: రాజకీయాల్లో ప్రత్యర్థులుగా ఉండాలి గానీ శత్రువులుగా ఉండొద్దని కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. స్థానిక అంబేడ్కర్ స్టేడియంలోని ఇండోర్ స్టేడియంలో కరీంనగర్ క్లబ్ ఆధ్వర్యంలో బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకొని, మాట్లాడారు. గెలుపోటములను సమానంగా స్వీకరించినప్పుడే క్రీడల్లో రాణిస్తారని, రాజకీయ నాయకులు కూడా గెలుపోటములను సమానంగా తీసుకోవాలన్నారు. తాను పార్లమెంట్ సభ్యుడిగా ఉన్న కాలంలో అథ్లెటిక్స్ క్రీడాకారుల కోసం రూ.7 కోట్లతో సింథటిక్ ట్రాక్ నిర్మించినట్లు చెప్పారు. అనంతరం బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రతినిధులు ఆయనను సత్కరించారు. సంఘం బాధ్యులు జితేందర్ రెడ్డి, అదనపు ఎస్పీ వెంకట్రావు, టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీనివాస్ గుప్తా, శంకరపట్నం జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాస్ రెడ్డి, సినీ నటుడు ప్రభాస్ శ్రీను, శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్మన్ రమేశ్‌రెడ్డి, డీఎస్పీ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

5 కేజీల గంజాయి స్వాధీనం

- నిందితులు హుజూరాబాద్‌వాసులు

ఖమ్మం క్రైం: ఖమ్మం రైల్వేస్టేషన్ వద్ద పోలీసులు శనివారం 5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు చేపట్టిన తనిఖీల్లో ఓ యువకుడు, ఇద్దరు మైనర్లు వెళ్తుండగా వారి బ్యాగ్‌లు పరిశీలించారు. అందులో గంజాయి లభించడంతో అదుపులోకి తీసుకున్నారు. హుజూరాబాద్‌కు చెందిన నీలం రాజు ఇద్దరు మైనర్లతో కలిసి గంజాయి కొనుగోలు చేసి, హుజూరాబాద్ ప్రాంతంలో విక్రయించేందుకు వెళ్తూ పట్టుబడ్డారని ఖమ్మం టౌన్ ఏసీపీ హరికృష్ణ, సీఐ స్వామి వెల్లడించారు.


గంజాయి, నిందితుడితో ఏసీపీ హరికృష్ణ